# అప్పుల రాష్ట్రమంటూ అసత్యపు ప్రచారం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- తెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి ఇచ్చాం
- డబ్బులన్నీ ప్రాజెక్టుల నిర్మాణాలకే ఖర్చు చేశాం
- తెలంగాణ కన్నా బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కువ అప్పులు
- ఆరు గ్యారంటీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్
- సీఎం రేవంత్, ఎంపీ బండి సంజయ్‌పై ఆగ్రహం

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి ఇస్తే.. అప్పుల రాష్ట్రమంటూ అసత్యపు ప్రచారంతో ఆరు గ్యారంటీలను విస్మరించారంటూ సీఎం రేవంత్‌పై మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌వోటీఆర్ ప్రాపర్టీ టాక్స్‌లో 84.2 శాతం తెలంగాణ సొంత డబ్బులని చెప్పారు. హర్యానా రాష్ట్రం 86.9 శాతంతో మొదటి స్థానంలో ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మిత్ర పక్షమైన పంజాబ్, గోవా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలన్నీ తెలంగాణ దరిదాపుల్లో కూడా లేవన్నారు. కొన్ని రాష్ట్రాలు 30 శాతం కూడా లేవని, 70 శాతం నిధులు కేంద్రమే ఇస్తుందని చెప్పారు. జార్ఖండ్, ఒడిశా 54 శాతమే మాత్రమేనని, కేంద్రం 46 శాతం ఇస్తే రాష్ట్రాలు బతికి బట్టకట్టాయన్నారు. 27.8 శాతం తెలంగాణకు అప్పులుంటే మిగిలిన 22 రాష్ట్రాలకు తెలంగాణ కన్నా ఎక్కువ అప్పులున్నట్లు తెలిపారు. దీనిపై ఎంపీ బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో బలమైన పార్టీగా బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన గొంతు వినిపిస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌పై, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అభండాలు వేశారని, పదేపదే అసత్యపు ప్రచారాలను సోషల్ మీడియాలో వైరల్ చేసి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరిమీద ₹5లక్షల అప్పు చేశారని కాంగ్రెస్ చేసిన అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టడంలో తాము విఫలమైనట్లు పేర్కొన్నారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. తెలంగాణ కన్నా బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కువ అప్పులు ఉన్నాయన్నారు. జీతాలు ఇవ్వడం లేదని విమర్శించే ముందు ఆ పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో మూడు నాలుగు నెలలకోసారి ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని మండిపడ్డారు. ఉద్యోగుల జీతాలు ఏనాడు ఎగ్గొట్టలేదని స్పష్టం చేశారు. పెద్ద ప్రాజెక్టులు కట్టినందున, వాటిపైన డబ్బులు ఖర్చుచేసినట్లు తెలిపారు. కొత్త రాష్ట్రం ఏర్పడినపుడు మనకు అప్పగించింది 7,770 మెగావాట్లు అని, కానీ నేడు 26వేల మెగావాట్లు ఉత్పత్తి చేసే విద్యుత్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

### స్థిరాస్తుల లెక్కలు ఎందుకు చెప్పడం లేదు..?

తెలంగాణను అప్పుల రూపంలో చూపిస్తున్నారే కానీ, స్థిరాస్తులన్న లెక్కలు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. అప్పులు తెచ్చి కట్టిన ప్రాజెక్టులు, భవన నిర్మాణాలు, సబ్‌స్టేషన్ల వాటి విలువ నేడు ఎంత మేర పెరిగిందో లెక్కలు వేసుకోవాలని సవాల్ చేశారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతలు, కృష్ణానది, సీతమ్మ ప్రాజెక్టు, ఖమ్మం జిల్లాలోని భక్త రామదాసు ప్రాజెక్టులకు పెట్టిన ఖర్చుల విలువ ఈనాటికి పెరగలేదా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులు కట్టిన రోజు స్టీల్ ధర ₹27వేలు టన్ను ఉంటే నేడు ₹70వేలకు పెరిగిందని తెలిపారు. సిమెంట్ ధరలు పెరిగాయన్నారు. 2014,15,16లో భూసేకరణకు ₹2 లక్షల నుంచి మొదలుకుని ₹8లక్షలు వరకు ఇస్తే రైతులు సంతోషంగా తీసుకున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం లక్షల ఎకరాలు భూసేకరణ చేసినట్లు చెప్పారు. నేడు ₹26లక్షలు పెట్టినా ఎకరం భూమి దొరకదన్నారు. సేకరించిన ఆస్తి తెలంగాణది కాదా? అని ప్రశ్నించారు. నాడు సేకరించిన భూములు నేడు ఆ ధరకు దొరుకుతాయా? అని ప్రశ్నించారు. వేల కోట్ల విలువ గల ఆస్తులు కూడబెట్టి ఇప్పటి ప్రభుత్వానికి అప్పగించినట్లు చెప్పారు. అందుకే తెలంగాణను బంగారు పల్లెంలో పెట్టి అప్పగించినట్లు చెబుతున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 60 హామీలు, ఆరు గ్యారంటీలిచ్చిందని, అవన్నీ చేయలేక అప్పుల రాష్ట్రం చేశారంటూ బదనాం చేస్తున్నారని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. అమెరికా, చైనా, జపాన్ ఎక్కువ అప్పులు తీసుకుని ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని చెప్పారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఒక బైక్ కొనుక్కున్నా ఈఎంఐ చెల్లిస్తాయని, అంటే అప్పులు చేసినట్లు కాదన్నారు. దీనిపై రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులు, అప్పులంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు. తీసుకున్న అప్పుల్లో ఒక్క ఇన్‌స్టాల్‌మెంటు కూడా ఎగ్గొట్టలేదన్నారు. తీసుకున్న అప్పులు కూడా పదేండ్ల తర్వాత కట్టాల్సి ఉంటుందని, అయినప్పటికీ నెల నెల చెల్లించినట్లు చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, బీజేపీ, కాంగ్రెస్‌కే పోటీ అంటూ బండి సంజయ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 39 మంది శాసనసభ్యులున్న బలమైన ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ అని స్పష్టం చేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన పొన్నం ప్రభాకర్‌కు డిపాజిట్ ఎలా పోతుందని, కాంగ్రెస్ డిపాజిట్ పోయేంత అధ్వానంగా లేదన్నారు. దీన్ని బట్టి ఎవరూ ఎవరికి పరోక్షంగా మద్దతిచ్చారో ప్రజలకు తెలుసునన్నారు. మధు యాష్కీ అధ్వానమైన లీడర్ కాదని, కాంగ్రెసోల్లు బీజేపీకి మద్దతిచ్చారని విమర్శించారు. నల్గొండ, భువనగిరిలో కాంగ్రెస్‌కు బీజేపీ సపోర్ట్ చేసిందన్నారు. ఈరెండు పార్టీల వైఖరిని గుర్తించిన తెలంగాణ ప్రజలు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌కు అక్కడక్కడ బీజేపీతోనూ, మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌తోనూ పోటీ ఉంటుందన్నారు. కొన్ని చోట్ల త్రిముఖ పోటీ ఉంటుందన్నారు. బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ అని చెప్పుకుంటున్నప్పటికీ, చాలా స్థానాల్లో బీజేపీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. బండి సంజయ్ ఇచ్చే పోటీని ఎదుర్కొంటామన్నారు. సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రాంమోహన్, బండ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే రిటైర్డ్ ఉద్యోగులకు పెద్దపీట

- దేశంలోనే తెలంగాణలో అత్యధికంగా పెన్షన్లు
- వైద్య పరంగా ఏ అవసరం ఉన్నా అందుబాటులో ఉంటా
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, డిసెంబర్ 17: కేసీఆర్ హయాంలోనే రిటైర్డ్ ఉద్యోగులకు పెద్దపీట వేశామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల క్లబ్‌లో జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 70 ఏండ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్లను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పెన్షనర్ల భవనంలో ఆడిటోరియం నిర్మాణానికి ₹5 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో అత్యధిక మొత్తంలో పెన్షన్లు ఇచ్చామన్నారు. దేశంలో కెల్లా తెలంగాణలోనే ప్రభుత్వ ఉద్యోగులకు అధిక వేతనాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దవాఖానలో క్యాన్సర్ రోగుల కోసం పాలియేటివ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. వైద్య సిబ్బంది స్వయంగా బాధితుల ఇంటికి వెళ్లి సేవలు సైతం అందిస్తున్నారని వివరించారు. వెయ్యికి పైగా గురుకులాలు ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. వైద్య పరంగా ఏ అవసరం ఉన్నా అందరికీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటానని, కంటి వైద్యం సైతం అందిస్తానని భరోసా కల్పించారు. కేసీఆర్ జగిత్యాల జిల్లాకు మెడికల్ కళాశాల కేటాయించడంతో నేడు మెడికల్ హబ్‌గా మారిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేసీఆర్ పని చేసి, తెలంగాణను దేశంలోనే అగ్ర భాగాన నిలిపారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరు అడుగుల మేర భూగర్భ జలాలు పెరిగింది తెలంగాణ రాష్ట్రంలో మాత్రమేనన్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ద్వారా 50 రకాల జిల్లా కార్యాలయాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో ప్రజలు, ఉద్యోగులకు పరిపాలన సౌలభ్యం కలిగిందని, నిత్యం కరీంనగర్ వెళ్లే బాధ తీరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారంటీల హామీల అమలుకు కృషి చేయాలని కోరారు. డీఏ, ఏరియర్స్, పీఆర్సీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంగరాజం, ప్రధాన కార్యదర్శి కరబుజ రవీందర్, కౌన్సిలర్లు ముస్కు నారాయణరెడ్డి, కౌన్సిలర్ పంబాల రామ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు కత్రోజ్ గిరి, చేని అనిల్, నూర్ బాషా అధ్యక్షులు అజ్జు భాయ్, సుంకె మహేశ్, పవన్, చిట్ల మనోహర్, మహేశ్, యూనిట్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా


మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

- లేకపోతే బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలి
- ఎంపీకి మేయర్ సునీల్‌రావు సవాల్

కార్పొరేషన్, డిసెంబర్ 17: కరీంనగర్ నగరపాలక సంస్థలో ద్విచక్ర వాహనాల పేరిట రూ.12 లక్షల బిల్లులు తీసుకున్నారని ఆరోపించిన ఎంపీ బండి సంజయ్ దానిని నిరూపించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు సవాల్ చేశారు. ఈ ఆరోపణలను నిరూపిస్తే తాను మేయర్ పదవికి రాజీనామా చేస్తానని, లేకపోతే ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు. ఆరోపణలను నిరూపించకపోతే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేస్తూ అవమానిస్తున్నారని విమర్శించారు. నగరపాలక సంస్థలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్న బండి సంజయ్ దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని పేర్కొన్నారు. నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి అసహనంతో ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో తన వద్ద రూపాయి లేదని చెప్పి గెలిచిన బండి సంజయ్ ఇప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రూ.50 కోట్లు ఎలా ఖర్చు చేశారో చెప్పాలన్నారు. గుట్కా, గంజాయి వ్యాపారులను వెంట వేసుకొని తిరుగుతున్న బండి సంజయ్ వచ్చే ఎన్నికల్లో గెలుస్తానని అనుకోవడం ఆయన భ్రమే అవుతుందన్నారు. బండి సంజయ్‌కి ప్రజలను మోసం చేయడం, రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఇవి ఏవి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పని చేయలేదని, దీంతో దిక్కుతోచక అసహనంతో నిరాధరమైన ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బల్దియా పాలకవర్గం సమన్వయంతో పని చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌ను గెలిపించుకున్నామని తెలిపారు. తామంతా ప్రజల మధ్యలోనే ఉంటున్నామని, కానీ బండి సంజయ్ ఏ రోజు కూడా ప్రజల మధ్యలో లేరని అన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన కొంత మంది ప్రజాప్రతినిధులను, నాయకులను లక్షల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేశారని విమర్శించారు. ఇందులో కొంత మంది నాయకులు ప్రలోభాలకు లొంగకపోవడంతో ఇప్పుడు వారిపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఇప్పటి వరకు ఎందుకు అవినీతిపై ప్రశ్నించలేదని నిలదీశారు. అవినీతి జరిగినప్పుడే ఎందుకు ఫిర్యాదు చేయలేదని, దద్దమ్మల్లా ఎందుకు కూర్చున్నారని ప్రశ్నించారు. తమ పాలకవర్గంలో నగరం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఎంతో గొప్పగా కరీంనగర్‌ను తీర్చిదిద్దామన్నది ప్రజల కళ్ల ముందు సజీవ సాక్ష్యంగా నిలిచిందన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు గంట కళ్యాణి, కుర్ర తిరుపతి, ఐలేందర్, వాల రమణారావు, నాయకులు గందె మహేశ్, సల్ల రవీందర్, కోల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# భాస్కర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


భాస్కర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

చిగురుమామిడి, డిసెంబర్ 17: బీఆర్‌ఎస్ నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్ ఎడవల్లి భాస్కర్ రెడ్డి మృతి బీఆర్‌ఎస్‌కు తీరనిలోటని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం చిన్న ములుకనూర్ గ్రామంలో ముప్పిడి విజయభాస్కర్ రెడ్డి ప్రథమ వర్ధంతికి హాజరయ్యారు. గునుకులపల్లెలో ఇటీవల మృతి చెందిన కేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇక్కడ ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని రమేశ్, బుర్ర తిరుపతి, ఎస్‌కే సిరాజ్, సన్నీల్ల మల్లేశం, పిల్లి వేణు, సర్పంచులు జక్కుల రవి, బోయిని శ్రీనివాస్, ముప్పిడి నరసింహారెడ్డి, సన్నీల్ల వెంకటేశం, బెజ్జంకి లక్ష్మణ్, జిల్లా నాయకులు సాంబారి కొమురయ్య, గవ్వ వంశీధర్ రెడ్డి, మండల నాయకులు రామోజు కృష్ణమాచారి, పెసర రాజేశం, చెప్యాల నారాయణరెడ్డి, ముంజ ప్రకాశ్, చెప్యాల శ్రీనివాస్, రాంబాబు, సర్వర్ పాషా, చంద్రయ్య, రాజశేఖర్ రెడ్డి, మొగిలి, జయప్రకాశ్ రెడ్డి, తదితరులున్నారు.

# 'బండి' ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు

కార్పొరేషన్, డిసెంబర్ 17: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై ఎంపీ బండి సంజయ్ ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బండి సంజయ్ మానసికంగా కృంగిపోయి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ముందంజలో సాగిందన్నారు. రెవెన్యూ ఆదాయంలో దేశంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు ఇంకా వెనకనే ఉన్నాయని గుర్తు చేశారు. పాస్‌పోర్టు ఆఫీస్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని, దమ్ముంటే సీజ్ చేయాలని సవాల్ చేశారు. 2014లో జీఎస్టీ 5.5 లక్షల కోట్లు ఉంటే ఇప్పుడు 12.93 లక్షల కోట్లకు చేరిందన్నారు. వరి ధాన్యం 2014లో 14.24 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి ఉంటే, ఇప్పుడు 141 లక్షల టన్నులకు చేరిందన్నారు. 2014లో ఐదు మెడికల్ కళాశాలలు ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 26కు పెరిగిందన్నారు.